

# రెప్పల మీద నీడలు

## – అత్తలూరి విజయలక్ష్మి



### (గత సంచిక తరువాయి)

3

**ట్రాన్స్ లో ఉన్నట్టుగా వింటున్న** మధురిమ ఉలిక్కిపడింది. పవిత్ర వెక్కి, వెక్కి ఏడుస్తోంది. మధురిమ కంగారుగా పిలిచింది "అమ్మా! ఏడవకు. ప్లీజ్ ఏడవకు." బతిమిలాడుతూ అంది.

ఆవిడ ఏడుపు ఆపలేదు. ఎన్నో ఏళ్లుగా గుండెల్లో దాచుకున్న బడబాగ్ని ఆ కన్నీళ్ళతో చల్లార్చి, ఆనవాలు కూడా మిగలకుండా కడిగేస్తున్నట్టు కారిపోతున్నాయి.

ఘనీభవించిన నది కరిగిపోయి, వెల్లువై పారుతున్నట్టు చెంపల మీద నుంచి జారి చెవుల మీదుగా తలగడని తడిపేస్తున్నాయి కన్నీళ్లు.

ఆవిడ ఏడుపు చూస్తుంటే మధురిమకి భయం వేస్తోంది. ఏనాడూ కనురెప్ప దాటని ఆవిడ కన్నీరు ఇప్పుడు వాగులై, వంకలై పారుతోంది.

గతం గుర్తుచేసి  పొరపాటు చేసానా అనుకోసాగింది.

ఆమెకి కూడా దుఃఖం వచ్చింది. అణచుకుంటూ "అమ్మా! సారీ...  నీకు అనవసరంగా గుర్తు చేసాను. పడుకోమ్మా. విశ్రాంతి తీసుకో... టెన్షన్ పడద్దమ్మా. ఆయనని నేను పిలిపిస్తాను.  ఆయన ఫోన్ నెంబర్ నాకు ఇవ్వు." అంది.

ఆవిడ వెక్కుతూ "నేను చేసిన పాపం ఈ కన్నీళ్ళతో కడిగేసుకోనీ మధూ!" అంది.

"నాకు తెలుసమ్మా . ప్రేమంటే  ఏమిటో నాకు తెలుసు. ప్రేమించిన వ్యక్తిని పొందలేక నువ్వు ఇంతకాలం ఎంత నరకం అనుభవించావో నేనర్థం చేసుకోగలను"

"నో" ఆవిడ అరుపుకి అదిరిపడి మాట కట్ చేసింది మధురిమ.

"నేనతన్ని ప్రేమించలేదు. ప్రేమిస్తే నా జీవితం మరోరకంగా ఉండేది.  నేనతన్ని ప్రేమించలేదు. అందగత్తెననే అహంకారంతో  అతన్ని కురూపి అని తిట్టాను. పైగా అసహ్యించుకున్నాను" బలవంతంగా అణచుకుంటున్న దుఃఖం ఆయాసంగా మారింది.

"నేనెంత అసహ్యించుకున్నా అతను ఎప్పుడూ బాధపడలేదు. ఆ చూపుల్లో, అతని పిలుపులో ఎంత మార్దవం! ఎంత అనురాగం! ఎంత  ఆత్మీయత!  ఎంతో మార్దవంగా పవిత్రా అని పిలుస్తుంటే  ఎంత బాగుండేది.  కానీ, కానీ ఆనాడు ఆ

పిలుపు వినిపిస్తే నిప్పుతొక్కిన కోతిని అయేదాన్ని. ఎన్ని తిట్టేదాన్నో, ఎంత బాధపెట్టానో తలచుకుంటే నా గుండె పగిలిపోతోంది మధూ! ఇప్పటికీ ఆ పిలుపు నాకు వినిపిస్తూనే ఉంది. ఎంతో మధురంగా, నా రాతి గుండెని కరిగించేలా... అలా పిలిచే వ్యక్తి ఒక్కడే. అతనే మోహన్... కృష్ణమోహన్."

కాలింగ్ బెల్ మోగింది.

పవిత్ర స్వరం టక్కున ఆగిపోయింది. భయంగా చూసింది . గజ,గజ వణుకుతూ చూసింది మధురిమ వైపు.

మధురిమ కూడా భయంగా చూసింది. ఆమె నుదుట మీద చిరుచెమట పట్టింది. 'పది దాటుతుంది వచ్చేసరికి అని ఇంత త్వరగా వచ్చాడేంటి నాన్న' అనుకుంది.

టైం చూసింది ... ఎనిమిది గంటల ఆరు నిమిషాలు.

ఏడింటికల్లా పవిత్రకి భోజనం పెట్టి, మందులు వేయాలి. ఆవిడ తన గతం చెబుతోంటే, ఆ కథలో మునిగిపోయి మర్చిపోయింది. ఇప్పటివరకు ఏం చేస్తున్నారు ఇద్దరూ అని ఆయన అడిగితే సమాధానం ఏం చెప్పాలి?

ఆవిడ వణుకుతున్న స్వరంతో అంది. "నాన్న వచ్చారు. "

మధురిమ ఆవిడ వణుకుతున్న చేతుల మీద చేయి వేసి మృదువుగా అంది."భయపడకు. కళ్ళు మూసుకుని పడుకో. నేనే ఏదన్నా చెప్తాలే. డోంట్ వర్రీ"

ఆవిడ పై పెదవితో కింది పెదవి నొక్కిపట్టి టెన్షన్ అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నిస్తోంటే, మధురిమ రెండోసారి మ్రోగిన బెల్ విని డోర్ వైపు వెళ్ళింది.

తలుపు తీసి "సారీ నాన్నా! బాగా తలనొప్పిగా ఉంటే పడుకున్నాను. టైం కూడా చూసుకోలేదు." అంది.

"అయ్యో పడుకున్నావా? మీ అమ్మ భోజనం చేసి, మందులేసుకుందా?" ఆందోళనగా అడిగాడు.

ఆయన స్వరంలో వినిపించిన ఆందోళన విచిత్రంగా అనిపించింది మధురిమకు. నాన్నకి అమ్మ మీద ఇంత ప్రేమ ఎక్కడి నుంచి వచ్చింది? ఆవిడ పూర్తిగా మంచం పట్టిందని జాలి చూపిస్తున్నాడా? లేక నటిస్తున్నాడా? దేనికి నటన? ఇంతకాలం లేని ప్రేమ ఇప్పుడు నటించినందువలన ఎలా వస్తుంది అనుకుంటారు ఎవరైనా? తన మొహంలో భావాలు కనిపించకుండా రెండు అరచేతులతో మొహం రుద్దుకుంటూ "లేదు నాన్నా. అమ్మ పడుకున్నట్టుంది. ఇప్పుడే పావుగంటలో ఉప్మా చేస్తాను." అంది.

ఆయన టైం చూసి, "ఇప్పుడా?" అని, "సరే చేయి. నేను కూడా ఉప్మానే తింటాను" అన్నాడు.

"సరే అందరికీ అదే చేస్తాలే" అంటూ ఊపిరి పీల్చుకుంటూ వంటగది వైపు వెళ్ళింది. ఆయన పవిత్ర పడుకున్న గదివైపు నడిచాడు. పవిత్ర పక్కకి ఒత్తిగిల్లి నిద్రపోతోంది.

ఆయన కొన్ని క్షణాలు ఆవిడ మొహంలోకి తదేకంగా చూసి, బట్టలు మార్చుకోడానికి తన గదివైపు వెళ్ళిపోయాడు.

పవిత్ర నెమ్మదిగా కళ్ళు తెరిచింది. అప్పటిదాకా ఆపుకున్న కన్నీరు రెండువైపుల నుంచి కారి దిండుని తడిపేసింది.

మర్నాడు ఉదయం మధురిమ తన ఇంటికి వెళ్ళిపోయింది. వెళ్లేముందు తల్లితో అంది. "మళ్ళీ ఆదివారం వస్తానమ్మా. అప్పుడు మిగతా కథ వింటాను. నువ్వు నిశ్చింతగా ఉండు. ఆందోళన పడి, ఆరోగ్యం పాడుచేసుకోకు. నీకు నేనున్నాను. నువ్వు ఫోన్ నెంబర్ ఇచ్చావుగా. తప్పకుండా మోహన్ గారికి ఫోన్ చేసి, రమ్మంటాను... ఆయన వస్తారు" .

"ఒద్దొద్దు" గాభరాగా అంది పవిత్ర.

"నాన్నగారిని అడక్కుండా ఇంటికి రమ్మని చెప్పకు. నువ్వు ఒకసారి మాట్లాడి ఆయన ఎలా ఉన్నాడో తెలుసుకో. నా ఆరోగ్యం బాగాలేదని చెప్పు. ఈలోగా నేను మీ నాన్నతో మరోసారి మాట్లాడతాను. బహుశా చావు, బ్రతుకుల మధ్య ఉన్నాను కాబట్టి, ఇప్పుడు ఆయన అతను రావడానికి ఒప్పుకోవచ్చు. ఏది ఏమైనా ఆయన అనుమతి లేకుండా అతడిని రమ్మని మాత్రం చెప్పద్దు."

మధురిమకి జాలేసింది. మోహన్ కేవలం స్నేహితుడా? అతన్ని ప్రేమించలేదు అని చెప్తోంది అమ్మ మరి ఎందుకు ఇంతగా అతన్ని చూడాలని ఆరాటపడుతోంది. ఎందుకు? ఏం జరిగింది ఇద్దరి మధ్యా? అతన్ని అవమానించాను అంటోంది. అతను అందంగా లేడని హేళన చేసి ఉండచ్చు. అది ఆ వయసులో సహజమే కదా! ఇంకా ఏమని ఉంటుంది? ఏ విధంగా ఆయన గుండె గాయం చేసి ఉంటుంది?

ఆలోచిస్తూనే, కాబ్ బుక్ చేసుకుని తండ్రి దగ్గర కూడా సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

మధురిమ వెళ్ళడంతో పవిత్రకి ఇల్లంతా శూన్యంగా అనిపించింది. ఇరవై నాలుగు గంటల్లో మధురిమ కూతురు పాత్ర నుంచి, ఒక ఆప్త మిత్రురాలుగా మారింది. తన మనసులో ఉన్న ఘర్షణ ని మధురిమకి కొంత పంచుకున్న తరవాత ఆవిడ మనసు కొంచెం తేలిగ్గా ఉంది. ఇంత కాలం భర్తకీ, తనకీ మధ్య ఉన్న అగాధం వల్ల ఒంటరిగా అనుభవించిన వేదన ఇప్పుడు కూతురికి చెప్పుకోడంతో నిశ్చింతగా ఉంది. ఆయన కాకపోతే, మధురిమ అయినా మోహన్ ని పిలిపిస్తుంది... అవసరం అయితే, తండ్రితో విభేదించి అయినా ఈ ఇంటికి తీసుకువస్తుంది. ఇంకో మార్గం లేదు. తను ఎక్కడికీ వెళ్ళే పరిస్థితిలో లేదు, ఇప్పట్లో ఆ పరిస్థితి వస్తుంది అన్న నమ్మకమూ లేదు. ఈ మంచం మీద నుంచి, మార్చురీకి వెళ్తుందో, మళ్ళీ నట్టింట్లో తిరుగుతుందో ఎవరికి తెలుసు?

నిట్టూర్చింది పవిత్ర. వెళ్ళిపోయే ముందు ఒక్కసారి అతన్ని చూసి, చేసిన తప్పుకి ఆ పాదాలు తాకగలిగితే!

అడుగుల శబ్దం వినిపించింది. శివరామకృష్ణ లోపలికి వచ్చాడు. ఆయన చేతిలో టాబ్లెట్స్ ఉన్నాయి.

టేబుల్ మీద ఉన్న మగ్ లో నీళ్ళు గ్లాసులో పోసి, ఆమె దగ్గరగా వచ్చి "మందేసుకో" అన్నాడు.

ఆవిడ మౌనంగా మాత్రలు మింగి నీళ్ళు తాగింది.

"మధు ఆదివారం వస్తానంది. పిల్లలని కూడా తీసుకువస్తుంది అనుకుంటా" అన్నాడు.

"అవును తీసుకురమ్మని చెప్పాను. వాళ్ళిద్దర్నీ చూసి చాలా రోజులు అయినట్టు ఉంది."

ఆయన తలాడించాడు. "పడుకుంటావా? కాసేపు కూర్చోగలవా?" అడిగాడు.

తల అడ్డంగా ఊపుతూ "లేదండి. ఓపిక లేదు పడుకుంటాను" అంది.

"సరే." ఆయన అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఆవిడ కళ్ళు మూసుకుంది.

"పవిత్రా " విసుగ్గా చూసింది అతని వైపు.

"నేను మీ ఇంటి ఎదురుగా పసుపు పచ్చ మేడలోనే ఉంటాను తెలుసా?"

"ఎన్నిసార్లు చెప్తావు?"

"మీ నాన్నగారు, మా నాన్నగారు వ్యాపారంలో భాగస్వాములు "

"అయితే, నాకెందుకు చెప్తున్నావు? "

"నువ్వు చాలా బాగుంటావు... నాకు నువ్వంటే ఇష్టం."

"ఛీ నీకు నేనంటే ఇష్టం ఏంటి కాకి మొహం నువ్వూనూ..."

అతని మొహం మాడిపోయింది. వెంటనే చిరునవ్వుతో అన్నాడు "నేను నల్లగా ఉంటాను అని నాకు తెలుసు. కానీ నా మనసు మల్లెపూవులా తెల్లనిది అంటారు అందరూ. "

"అయితే ఇంకేం మాల కట్టి మెళ్ళో వేసుకో... ఛీ" చీత్కారంగా అంటూ, పవిత్ర బ్యాగ్ కుడి భుజం నుంచి ఎడమ భుజానికి మార్చుకుని పరిగెత్తింది.

మోహన్ ఆమె వెళ్ళిన వైపు ఆరాధనగా చూస్తూ నిలబడిపోయాడు.

పవిత్ర నేరుగా ఇంట్లోకి వెళ్ళింది. బ్యాగు విసురుగా దివాన్ మీదకి విసిరేసి, గట్టిగా పిలిచింది "నానమ్మా"

"ఏంటమ్మా" పవిత్ర వచ్చినట్టు ఆమె అడుగుల శబ్దం చెప్తుంది ఆవిడకి. ఆ శబ్దంలో పొగరు, దర్పం కలిసి ఉంటాయి.

"పసుపుపచ్చ మేడలో వాళ్ళు ఎప్పుడు వెళ్ళిపోతారు?" అడిగింది.

"ఎందుకు? అయినా వాళ్ళ ఇంట్లోంచి వెళ్ళమనడానికి మనకేం హక్కుంది?" అంది ఆవిడ.

"వాళ్ళు నాకు నచ్చలేదు... వాళ్ళబ్బాయి నల్లగా ఉన్నాడు. పంపించేయమని చెప్పు నాన్నకి."

"తప్పు అలా అనకూడదు... నల్లగా ఉంటె నీకెందుకు? తెల్లగా ఉంటె నీకెందుకు? వెళ్లి, కాళ్ళు, చేతులు కడుక్కురా... పాలు తాగుదువుగాని" ఆవిడ మందలిస్తూ వంటగదిలోకి వెళ్ళిపోయింది.

పవిత్ర నాంచారమ్మ వెళ్ళిన వైపు కోపంగా చూసి, కిటికీ దగ్గరగా వెళ్లి పసుపు పచ్చ మేడ వైపు తొంగి చూసింది. తనతో మాట్లాడిన మోహన్ డాబా మీద నిలబడి తన ఇంటివైపు చూస్తూ ఉండడం కనిపించింది.

పెద్ద శబ్దంతో అనవసరంగా కిటికీ గభాల్న మూసి, కాళ్ళు నేలకేసి గట్టిగా కొడుతూ పెరటివైపు వెళ్ళింది.

"నల్లవెధవ ... అంత నల్లగా ఉండి వీడికి ప్రేమ కావాలిట సిగ్గులేకపోతే సరి..."

కాళ్ళు, చేతులు, మొహం కడుక్కుని వచ్చి, టవల్ తో మొహం తుడుచుకుంటూ, అద్దంలో చూసుకుంది.

బంగారం ముద్దలో, పసుపు కలిపినట్టున్న ఒంటి రంగు, అలలు, అలలుగా వంపులు తిరిగిన వత్తైన జుట్టు, విశాలమైన కనుదోయి, గులాబీరంగులో ఉన్న సన్నని పెదాలు, ఎంత అందం తనది. ఛ... అసలు నల్లవెధవ తన వైపు చూడడం ఏవిటి? ఎంత ధైర్యం ఉండాలి తన వైపు చూడ్డానికి. తన అందానికి సినిమా హీరోలాంటి అబ్బాయి మాత్రమే సరిపోతాడు. రేపు కచ్చితంగా చెప్పాలి తన వైపు చూడద్దని.

స్థిరంగా నిర్ణయించుకుంది.

"పవిత్రా రా ఇలా వచ్చి పాలు తాగు" నాంచారమ్మ గొంతు విని, వంటగది వైపు నడిచింది.

మర్నాడు రోజూలాగే పవిత్ర కాలేజ్ కి వెళ్ళడానికి గేటులో నుంచి బయటకు వచ్చింది.

పవిత్ర కాలేజీ ఇంటికి బాగా దగ్గర. నడిచే వెళ్తుంది... నడిచే వస్తుంది. మధ్యలో వీధి చివర ఉండే శ్రీదేవి, సత్యశ్రీ కూడా సరిగ్గా అదే టైం కి ఆమెతో కలుస్తారు. ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ కాలేజ్ కి నడిచి వెళ్తారు. నాలుగు వీధులు దాటి మెయిన్ రోడ్డు ఎక్కితే కాలేజీ గేటు.

ముగ్గురికీ అక్కినేని నాగేశ్వరరావు అంటే ఇష్టం. ముగ్గురూ సినిమాలకి బాగా వెళ్తారు. ఆదివారం వస్తే చాలు, తలంట్లు పోసుకుని, పరికిణీ ఓణీ లు వేసుకుని, పొడుగాటి జడల్లో డిసెంబర్ పూల మాలో, కనకాంబర మాలో, జాజిపూల మాలో పెట్టుకుని సినిమాలకి వెళ్ళడం, ఆరోజంతా ఆ సినిమా కథలతో, కబుర్లతో ఇంట్లో వాళ్ళని విసిగించడం ముగ్గురికి అలవాటు. అలా ముందు రోజు చూసిన డాక్టర్ చక్రవర్తి సినిమాలో నాగేశ్వరరావు నటన గురించి, నవ్వు గురించి, సావిత్రి అందం గురించి మాట్లాడుకుంటూ కాలేజ్ చేరారు. సాధారణంగా ఇంట్లో వాళ్ళతోటే వెళ్తారు, ఈ మధ్యే అప్పుడప్పుడు ముగ్గురు కలిసి వెళ్ళడం మొదలుపెట్టారు. అమ్మా, నాన్నలతో వెళ్ళేకన్నా, ఆ వయసులో స్నేహితులతో వెళ్ళడం బాగుంటుంది... అందులో థ్రిల్ ఉంటుంది. ఆ థ్రిల్ వాళ్లకి చాలా ఇష్టం.

ఆరోజు కాలేజ్ గేటులో రోజూలాగే కబుర్లు చెప్పుకుంటూ అడుగుపెట్టారు.

విశాలమైన ప్రాంగణం లో అమ్మాయిలూ, అబ్బాయిలు గుంపులుగా, కబుర్లు చెప్పుకుంటూ బిల్డింగ్ వైపు నడుస్తున్నారు. కుడివైపు పెద్ద చెట్టు కింద ఒంటరిగా నిలబడి ఉన్న మోహన్ పవిత్రని చూడగానే చక,చకా ఉత్సాహంగా వచ్చాడు. అతను దగ్గరగా రాగానే సంపెంగపూల పరిమళం గుప్పుమంది.

పవిత్ర అతని వైపు చూడగానే కుడిచేయి గుప్పిట తెరిచాడు. గుప్పిటి నిండా సంపంగి పూలు. “ఇదిగో  పవిత్రా నీ కోసమే “ అన్నాడు ఆమె ముందుకు చేయి చాపి.

పవిత్రకి అతనలా ప్రత్యేకంగా తనకోసం పూలు తెంపి తీసుకురావడం అది కూడా తన స్నేహితురాళ్ళ ముందు ఇవ్వడం నచ్చలేదు. ఆగ్రహంతో అతని చేతి విసిరికొట్టింది. పూలు కింద పడ్డాయి.

“అయ్యో” గబుక్కున అతను ఒంగి పూలు ఏరి “ నీ కోసం త్వరగా వచ్చి  తెంపాను పవిత్రా. ప్లీజ్  జడలో పెట్టుకో బాగుంటుంది” అన్నాడు.

“నాకు తెలుసు బాగుంటుంది అని. నువ్వేం చెప్పక్కర్లేదు. అయినా నీ నల్లచేత్తో ఎవరు కోయమన్నారు పూలు?” విసురుగా అంది.

పక్కన ఉన్న ఇద్దరు అమ్మాయిలూ కిసుక్కున నవ్వారు.

కొన్ని క్షణాలు మోహన్ మొహం మరింత నల్లగా మారింది.

నిశ్శబ్దంగా ఆ పూలు అరచేతిలో అలాగే ఉంచుకుని, వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

“ఏయ్ శ్రీ... సత్యా! వీడు ఇంకెప్పుడూ నాకేసి చూడకుండా ఏదన్నా బుద్ధి చెప్పాలే. ఏం చేద్దాం?” అడిగింది పవిత్ర స్నేహితురాళ్ళను .

“ఏముంది? గుడ్లు పీకేద్దాం” అంది సత్య.

“ఛ ఊరుకొండే పాపం. నీ వైపు చూస్తే తప్పేంటే? అందంగా ఉన్నావు కాబట్టి చూస్తాడు. ఎంత ప్రేమిస్తున్నాడో నిన్ను “ అంది శ్రీదేవి.

“పళ్ళు రాలగొడతాను. నీకంత జాలిగా ఉంటే, నిన్ను ప్రేమించమని చెప్పు.  నన్నెందుకు? అయినా వాడి మొహానికి నన్ను ప్రేమించే అర్హత ఉందా?” మండిపడింది పవిత్ర.

“ఇంకేం లా... మా బావ విన్నాడంటే ఆ అబ్బాయిని అనవసరంగా కొడతాడు.  గట్టిగా అనకు ఆ మాట” అంది శ్రీదేవి.

“అవునులే. నీకు పనికి రాదు కానీ, నేను మాత్రం అయ్యో ప్రేమిస్తున్నావా, అయితే రా పార్క్ కి వెడదాం అని తీసుకుని వెళ్ళాలి కదా... మొహం చూడు.”

పవిత్ర మాటలకి సత్యా, శ్రీదేవి నవ్వారు.

“నిన్ను ప్రేమించమని చెప్పడం లేదే. మరీ అంతగా తిట్టకు ఆ అబ్బాయిని అంటున్నాను.” అంది శ్రీదేవి.

“తిట్టడం కాదు మా నాన్నగారికి చెప్పి చితక్కొట్టిస్తా “ అంది పవిత్ర కసిగా.

"సరేలే పదండి క్లాస్ టైం అయింది" సత్య హెచ్చరించడంతో ముగ్గురూ క్లాసుల వైపు నడిచారు.

ముందుకు నడిచిన పవిత్ర కొద్దిగా తల కుడివైపు భుజం మీదుగా తిప్పి, మాడిపోయిన మొహంతో గుప్పిట్లో ఉన్న సంపెంగ పూలనే చూస్తున్న మోహన్ ని చూసింది. ఆమెకేమీ జాలి కలగలేదు. మరోసారి నల్లమొహం అనుకుంది.

మూడున్నరకి కాలేజీ అయిపోయాక, స్నేహితురాళ్ళతో కాసేపు బాతాఖానీ కొట్టి, నాలుగు గంటలకు నెమ్మదిగా నడుచుకుంటూ ఇంటి దారి పట్టింది.

ఇంటికి దగ్గరవుతున్న సందు మలుపు తిరిగింది. ఆమెని చూడగానే గబ,గబా వచ్చాడు మోహన్. "పవిత్రా! ఒక్కసారి మాట్లాడచ్చుగా. నా ఒంటి రంగు స్నేహానికి కూడా పనికిరాదా?" దీనంగా అడిగాడు.

"నీతో నాకు స్నేహం ఏంటి? తప్పుకో... నన్ను వెళ్ళనీ" చిరాకు పడింది.

"అలా మాట్లాడకు పవిత్రా! ఎందుకో తెలియదు. నిన్ను చూసిన క్షణం నుంచీ నేను నేనుగా లేను. ఒక్కసారి నాతొ మాట్లాడవూ!" దారికాచి ప్రాధేయపడుతున్న అతన్ని చీదరించుకుంటూ అంది "ఇంకోసారి నాతొ మాట్లాడావంటే మా నాన్నకి చెప్పి చితక్కొట్టిస్తా జాగ్రత్త... వెళ్ళు నీ మొహం చూపించకు"

"నువ్వు కొట్టినా, నన్ను కోసినా నిన్ను చూడకుండా ఉండలేను పవిత్రా!"

"అయితే చావు" కచ్చగా అరిచి పరిగెత్తింది.

ఆమె ఎంత అసహ్యించుకుంటున్నా మోహన్ కి ఆమె మీద కోపం రావడం లేదు... పైగా అంకురించిన ప్రేమ చివుర్లు తొడగసాగింది. ఆశ అనే ఎరువు వేస్తూనే ఉన్నాడు. అతనికి తన అందం మీద దృష్టి లేదు. తన ప్రేమ మీద నమ్మకం. ఈ ప్రపంచంలో తనకన్నా ఇంకెవరూ ఆమెని ఇంత గాడంగా ప్రేమించరు అనే విశ్వాసం. ప్రేమించే ప్రతి హృదయం అలాగే అనుకుంటుందేమో! ఎందుకంటే ప్రేమకి అర్హతలు ఎవరూ నిర్ణయించలేదు.

ప్రతిరోజూ పవిత్ర బయలుదేరే సమయానికే అతను బయల్దేరడం, అప్పటివరకు బాగ్ భుజానికి తగిలించుకుని గుమ్మానికి వేళ్ళాడుతూ నిలబడడం ఆమె దృష్టి నుంచి పోలేదు. తను ఇంట్లో నుంచి బయటకు రాగానే, అతనూ బయటకు రావడం జాగ్రత్తగా గమనించసాగింది.

మనసు చిత్రమైంది. తనని ఎవరన్నా గాడంగా వాంచిస్తున్నారని తెలిసినప్పుడు అప్రయత్నంగానే వాళ్ళ మీద మనసు కేంద్రీకృతం అయి ఉంటుంది. తన ప్రతి కదలికా వాళ్ళు గమనిస్తున్నారా లేదా? అన్న ఆలోచన, గమనిస్తే బాగుండు అనే ఆశ తన ప్రమేయం లేకుండానే రెప, రెపలాడుతుంటాయి.

ఇప్పుడు పవిత్ర మనసు అలాగే ఉంది. ఒకపక్క అతన్ని అసహ్యించుకుంటూనే, అతను తనని గమనిస్తున్నాడా లేదా అని ఆసక్తిగా పరిశీలించడం మొదలు పెట్టింది. కాలేజ్ కి వెళ్ళేటప్పుడు ఎదురింటి మేడ వైపు అప్రయత్నంగానే దృష్టి

మళ్ళుతుంది. కాలేజ్ నుంచి వచ్చేటప్పుడు కళ్ళు అతని కోసం వెతుకుతాయి. అతను ఎదురుపడగానే ఎక్కడలేని చీదరని మొహంలోకి తెచ్చుకుని, మొహం చిట్లించి వెళ్ళిపోతోంది.

"పిన్నిగారూ! దసరా నవరాత్రులు చేసుకుంటున్నాను. పవిత్రని కన్నె ముత్తైదువగా పంపించరూ! " పచ్చని పట్టుచీర కట్టుకున్న చాముండేశ్వరి కుంకుమ భరిణతో వచ్చింది.

నాంచారమ్మ కి బొట్టు పెడుతూ, "మీ కోడలు ఎక్కడ? ఆవిడని కూడా ఒక ముత్తైదువగా రమ్మని చెప్పండి. రోజొకరిని పెట్టుకుని పసుపు, కుంకుమ ఇచ్చి అమ్మవారి రూపంలా పూజించుకుంటాను. పదేళ్ళ నుంచీ అమ్మవారి నవరాత్రులు చేస్తున్నాను." అంది చాముండేశ్వరి.

"అలాగేనమ్మా తప్పకుండా పంపిస్తాను. గుడికి వెళ్ళారు అబ్బాయి, కోడలు " అంది నాంచారమ్మ.

చాముండేశ్వరి, నానమ్మ పక్కనే నిలబడి చారడేసి కళ్ళతో చూస్తున్న పవిత్ర చెక్కిలి మీద మునివ్రేళ్ళతో నొక్కి, నుదుట బొట్టు పెట్టి, " కన్నె ముత్తైదువగా రా తల్లీ... శీఘ్రమే కల్యాణం అవుతుంది"అంది నవ్వుతూ.

పవిత్ర ఏమి అనలేదు. చూస్తూ ఉండిపోయింది. పచ్చగా ఉన్న చాముండేశ్వరి, నిండుగా నగలతో అమ్మవారిలా ఉన్న చాముండేశ్వరి, ఆ నల్ల మొహం మోహన్ కి అమ్మా! ఎలా సాధ్యం? అనుకుంటోంది.

"మీరూ రండి పిన్నిగారూ భోజనం చేసి వెళ్ళచ్చు" గుమ్మందాకా నడిచి వెనక్కి తిరిగి అంది ఆవిడ.

నాంచారమ్మ నవ్వింది " అలాగే " అంది.

ఆవిడ వెళ్ళిపోయింది. తీసుకుని వచ్చిన వెలుగు తనతోటే కుంకుమ భరిణలో దాచి, మూతపెట్టి తీసుకుని వెళ్ళిపోయింది.

"అంటే ఏంటి నానమ్మా! నేనేం చేయాలి?" ఆవిడ గుమ్మం దాటగానే నానమ్మని చుట్టేసి అడిగింది పవిత్ర.

"ఏమి చేయక్కర్లేదు... రేపు కాలేజికి సెలవే కదా! వాళ్ళింటికి వెళ్ళి ఆవిడ చేసి పెట్టిన కమ్మటి భోజనం తిని తాంబూలం తీసుకుని రా..." అంది నానమ్మ.

పవిత్రకి కుతూహలం కలిగింది. రేపు ఈ వంకతో వాళ్ళింటికి వెళ్ళి ఆ మోహన్ గాడిని బాగా ఏడిపించాలి అనుకుంది.

"అమ్మా, నువ్వు కూడా వస్తారా " అడిగింది పవిత్ర.

"మేము భోజనం టైం కి వస్తాము. ఇంట్లో అమ్మ కూడా పూజ చేసుకోవాలి, నాన్నకి, అన్నయ్యకి వంట చేయాలి కదా!"

"ఆవిడ నీకు బొట్టు ఎందుకు పెట్టలేదు?" అడిగింది.

"తాతయ్య లేరుగా తల్లీ. నా సౌభాగ్యం అంతా ఆయనే తీసుకుని వెళ్ళారు." నిట్టూరుస్తూ అంది.

ఆ మాటలు పవిత్రకు నచ్చలేదు. తాతయ్య లేకపోతే బొట్టు ఎందుకు పెట్టుకోరు. తను ఇంతకాలం గమనించలేదు కానీ, నానమ్మ ఎప్పుడూ బొట్టు పెట్టుకోడం చూడలేదు. పవిత్ర చిన్నప్పుడే ఆయన పోయాడు.

"అదేంటి నానమ్మా... తాతయ్య పోవడానికి నువ్వు బొట్టు పెట్టుకోడానికి సంబంధం ఏంటి?"

"స్త్రీకి వివాహం తోటే సౌభాగ్యం వస్తుంది. సౌభాగ్యం అంటే పసుపు,కుంకుమ, పూలు, తాళిబొట్టు... ఆ సౌభాగ్యం ఆయన లాల్చీ జేబులో పెట్టుకుని వెళ్ళిపోయారే. నా జీవితం ఇలా వెళ్లిపోవాల్సిందే." అంది ఆవిడ.

ఎన్నడూ లేనిది ఆవిడ స్వరం గాద్గదికం అవడం గమనించిన పవిత్రకి ఆవిడ మాటలు అర్థం కాకపోయినా, ఆవిడ పట్ల మాత్రం ప్రేమ ఉప్పొంగింది. ఆవిడ మెడ చుట్టూ చేతులు పెనవేసి, దగ్గరగా హత్తుకుని "సారీ నానమ్మా..." అంది.

ఆవిడ నవ్వింది. "నా దురదృష్టానికి నువ్వెందుకమ్మా సారీ చెప్పడం" అంది మనవరాలి తల నిమురుతూ.

ఆ రోజంతా పవిత్రని నానమ్మ మాటలు వెంటాడుతూనే ఉన్నాయి. అద్దంలో తనని తాను చూసుకుని, నేను బొట్టు పెట్టుకుంటాను, పూలు పెట్టుకుంటాను, అప్పుడప్పుడు పండగలు, పూజలు అయితే, కాళ్ళకి పసుపు రాసుకుంటాను. నాకు పెళ్లి అవలేదు కదా... ఇవన్నీ ఎందుకు పెట్టుకోవాలి? అని ప్రశ్నించుకుంది. సమాధానం తట్టలేదు.

మరునాడు పట్టు పరికిణీ, ఓణీ వేసుకుని, మెడలో జాజిమొగ్గల నెక్లస్, చంద్రహారం, రెండు చేతులకి బంగారు గాజులు, కాళ్ళకి పట్టాలు, వదులుగా ఒక జడ, జడనిండా పూలు, కళ్ళకి కాటుక, దోసగింజ ఆకారం బొట్టు . అమ్మవారి అనుంగు పుత్రికలా చాముండేశ్వరి ఇంటికి బయలుదేరింది పవిత్ర.

తల్లిద్వారా ఆరోజు కన్నె ముత్తైదువగా పవిత్ర వస్తోందని తెలిసిన మోహన్ వాకిలి ముందే ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

పవిత్ర గేటు తీసుకుని సిమెంట్ గచ్చు మీద నడుస్తూ వస్తోంది. ఓ అప్సర కన్య వాకింగ్ కి వచ్చినట్టు అనిపించింది మోహన్ కి. అప్పుడే మొక్కలకి నీళ్ళు పెట్టినట్టున్నాడు అప్పన్న, తడి,తడిగా ఉంది. పరికిణీ కుచ్చిళ్ళు కొద్దిగా ఎత్తి పట్టుకుని నెమ్మదిగా అడుగులు వేస్తూ వచ్చింది. పొడుగాటి జడ కుడివైపు వక్షం మీద వేల్లాడుతోంది. జడలోని పూల దండ మెడమీదకి జారి, ఆమె మెడ నునుపు దనాన్ని ఆస్వాదిస్తోంది.

"స్వాగతం పవిత్రా! " చాటంత మొహం చేసుకుని గుమ్మం లోనే పలకరించాడు.

పరికిణీ కుచ్చిళ్ళు వదిలేసి, మొహం చిట్లించింది.

"రా పవిత్రా! మా ఇల్లు పావనం అయింది తెలుసా! ఎంత అందంగా ఉన్నావు! " కళ్ళ నిండా వెలుగు నింపుకుని ఆమె వైపు అపురూపంగా చూస్తూ అన్నాడు.

ఆ చూపుకి పవిత్ర గుండె మండింది. "తప్పుకో " అంది చిరాగ్గా.

ఆమె మాటలోని చిరాకుని గమనించి అతని మనసు చివుక్కుమంది. అప్రయత్నంగా గుమ్మం నుంచి నాలుగు అడుగులు వెనక్కి వేసి, గోడవారగా నిలబడ్డాడు.

అప్పుడే అటు వచ్చిన అతని తండ్రి పార్థసారధి పవిత్రని చూడగానే ఆమె దగ్గరగా వచ్చి, 'రా తల్లి, మహాలక్ష్మిలా ఉన్నావు... రా, రా' అంటూ తల వెనక్కి తిప్పి లోపల ఉన్న చాముండేశ్వరి కి వినిపించేలా "చామూ! బంగారు వచ్చింది" అన్నాడు.

లోపల నుంచి బెల్లం కరుగుతున్న కమ్మని వాసన, పులిహోర పరిమళంతో పాటు ఆవిడ గొంతు వినిపించింది.

"రామ్మా పవిత్రా ఇలా వచ్చేయ్..."

"వెళ్ళు తల్లి... ఆవిడ వంట హడావుడిలో ఉంది" అంటూ వంట గదివైపు చూపించాడు.

పవిత్ర ఆయనకి  నమస్కరించి, ఓర కంట చూసీ చూడనట్టు మోహన్ ని ఒకసారి చూసి, ఆవిడ స్వరం వినిపించిన వైపు వెళ్ళింది.

విశాలమైన గది, ఓ పక్క స్టవ్ గట్టు, దాని మీద గ్యాస్ స్టవ్. నీళ్ళ బిందెలు, గిన్నెలు, పులిహోర నింపిన పెద్ద బేసిన్, మరో పక్క గిన్నెలు, మూలగా సింకు., దాన్నిండా గిన్నెలు, ఆ గదిలో మరో మూల దేవుడి మందిరం, పూజకి సిద్ధం చేసుకున్నట్టు మందిరం దగ్గర  పూల సజ్జ, రకరకాల పండ్లు పెట్టిన ట్రేలు, పానకం, వడపప్పు,  మధ్యలో చెక్క డైనింగ్ టేబుల్, ఆరు కుర్చీలు గందరగోళంగా  ఉంది.

ఎక్కడ కూర్చోవాలో తెలియక బిక్కమోహంతో నిలబడిన పవిత్ర దగ్గరగా వచ్చి, "కొంచెం సేపు మా మోహన్ గదిలో కూర్చో... ఈ కాసిని గారెలు చేసి, ఇదంతా శుభ్రం చేసి పిలుస్తాను" అంది ఆవిడ.

'మోహన్ గదిలోనా... ఆ కాకి గదిలోనా. ఛీ, ఛీ అనుకుంది కానీ పైకి ఏమి అనకుండా మౌనంగా ఉండిపోయింది.

"మా వాడు పాటలు పాడతాడు... పియానో వాయిస్తాడు వెళ్లి కాసేపు నేర్చుకో" అంది ఆవిడ ఆప్యాయంగా.

వాడి మొహానికి అదోకటా అనుకుంటూ నెమ్మదిగా కదిలి హాల్లోకి వచ్చింది.

హాల్లో సోఫాలో నిశ్శబ్దంగా కూర్చున్న మోహన్ పవిత్రని చూసి గబుక్కున లేచి "ఏమన్నా కావాలా పవిత్రా!" అనడిగాడు.

మొహం  చిట్లించి మాట్లాడకుండా అటు, ఇటూ హాలంత పరికించి చూసి షెల్ఫ్ లో కనిపిస్తున్న పుస్తకాల దగ్గరకు వెళ్లి, ఒక పుస్తకం తీసుకుని వచ్చి మరో సోఫాలో కాలు మీద కాలు వేసుకుని కూర్చుంది.

ఆమె చదువుతున్న పుస్తకం అట్టమీద టైటిల్ చూసాడు. హిమబిందు , అడవి బాపిరాజు అని ఉంది.

"నువ్వు సాహిత్యం చదువుతావా!" అడిగాడు.

పవిత్ర మాట్లాడలేదు.

చాముండేశ్వరి అతని గదిలోకి వెళ్ళు అంది కానీ అతను గదిలోకి వెళ్ళకుండా హాల్లో తనకోసమే కూర్చున్నట్టు అనిపించింది.

బహుశా అతను తనని పట్టించుకోకుండా గదిలోకి వెల్లి పియానో వాయించుకున్నా, పుస్తకం చదువుకున్నా అతను తనని నిర్లక్ష్యం చేసాడని కోపం వచ్చేది. ఇప్పుడు ప్రత్యేకంగా అక్కడే కూర్చుని తన పట్ల శ్రద్ధ, ఆసక్తి కనపరుస్తుంటే, అతన్ని ఆట పట్టించాలని, అవమానించాలని అనిపిస్తోంది.

కారణం ఆమెకే తెలియదు కానీ, అతడిని ఉత్తి పుణ్యానికి అవమానించాలని అనిపిస్తోంది.

అందుకే బింకంగా అతని పలకరింపులు తనని కాదు అన్నట్టు ఏ మాత్రం స్పందించకుండా పుస్తకం తెరిచి, కళ్ళు అక్షరాల వైపు తిప్పింది. కానీ ఆ కళ్ళని అక్షరాలు ఆకట్టుకోలేదు. కారణం చదువుతున్న పుస్తకం మీద కన్నా తన ఎదురుగా కూర్చుని తననే పరికిస్తున్న అతని మీదే ఆమె దృష్టి కేంద్రీకరింపబడి ఉంది. బహుశా యవ్వనం తొలిరోజుల్లో అమ్మాయిలకి అబ్బాయిలు తనపట్ల ఆసక్తి కనపరచడం అహంతో కూడిన తృప్తి నిస్తుంది కాబోలు.

"చాలా బాగున్నావు పవిత్రా! నీకు ఈ కలర్ బాగా నప్పింది."

పొగరుగా తల తిప్పుకుని, సమాధానం చెప్పకుండా కూర్చుంది.

అతను కూడా మళ్ళీ ఏమి అనకుండా నిశ్శబ్దంగా, ఆమెనే గమనిస్తూ కూర్చున్నాడు. అతని చూపులు తనవైపే ఉన్నాయని ఆమెకి తెలుస్తోంది. పుస్తకం పక్కన పెట్టేసింది.

"నువ్వు పియానో వాయిస్తావుటగా?" అంది.

"అమ్మ చెప్పిందా? వింటావా?" ఉత్సాహంగా అడిగాడు.

వినాలనిపించింది. విని దరిద్రంగా వాయించావు అని అవమానించాలి అనిపించింది. "పూజ స్టార్ట్ అవుతుందేమో!" అంది సందేహంగా.

"ఇంకా టైం ఉంది. అమ్మ వంట పూర్తి అయాక, కిచెన్ క్లీన్ చేసుకుని, పూజ చేస్తుంది."

అనాసక్తంగా అటూ, ఇటూ చూసింది. అతను లేచి తన గదివైపు వెళ్తూ 'రా పవిత్రా!' అన్నాడు.

ఆమె లేచింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS